సుందరమ్మకు అర్థమయిపోయింది మధుమూర్తి ఏదో మాస్టర్‌ప్లాన్ వేస్తున్నట్లు. ఇనుమును వేడెక్కించే ప్రయత్నంలో అతని ఒళ్ళోకి జారిపోయింది చల్లగా.

"మరిప్పుడేం చేద్దాం?" ఆమె మత్తుగా చూస్తూ అడిగింది.

"చేసేదేం లేదు. పోయిన ఇమేజ్‌ను తిరిగి రెట్టింపు చేసుకోవాలి."

ఆమె బిత్తరపోయింది "అదెలా సాధ్యం?"అడిగింది మధుమూర్తిని.

"అదే కదా మధుమూర్తి అంటే"

ఆమె ఆశ్చర్యపోలేదు. ఎందుకంటే అతని గురించి ఆమెకు బాగా తెలుసు.

అతను చెప్పుకుపోతున్నాడు "సాధ్య మైనంతవరకు చిట్‌ఫండ్ కంపెనీలు, ఫైనాన్సు కంపెనీలు పేపర్స్‌కి దూరంగా వుండాలి. ప్రజలకి అతి చేరువలో వుండే మీడియా పేపర్స్ ఒక్కటే. వాటి దృష్టికి వచ్చామంటే మన పరువు రోడ్డెక్కుతుంది. ఎక్కనంతవరకే మనలాంటి చార్ సౌ బీస్‌గాళ్ళ పని. ఒక్కసారి ఎక్కాక నీవు తిరిగి రిజాయిండర్స్ ఇచ్చినా, పొరపాటున అచ్చయిందన్నా ప్రయోజనం శూన్యం. మొత్తానికి అనుమానం వచ్చేస్తోంది ప్రజల్లో. అక్కడినుంచి వాళ్ళ ఆరాలు ఎక్కువవుతాయి. కనుక మనం ఈ దెబ్బను మన ఇమేజ్‌ను పెంచుకోవటానికి వాడుకోవాలి. తెలివి వుంటే మన చేతిలో బాంబు వుండక్కరలేదు. అవతలివాడు విసిరిన బాంబుని ఒడుపుగా పట్టుకుని తిరిగి వాడిమీదకు విసరవచ్చు. సో....ఇప్పుడు--నీకు ఇంకా ఎక్కువగా, పెద్దమొత్తంలో మోసం చేసే అవకాశం ఆ పేపర్ ఇచ్చింది" అన్నాడు నింపాదిగా ఆమె పెట్టికోట్‌ను జారవిడుస్తూ.

ఆ తరువాత పట్టాభిని మీదకు లాక్కుంది. పట్టాభి ఇప్పుడు రాష్ట్రకేబినెట్ మంత్రి. అతను కేంప్‌మీద ఈవేపుకు వస్తే నీకోసమే నేను విరహంతో వేగిపోతూ అభిసారికలా ఎదురు చూస్తున్నాన్న ంటు ంది.

ప్రపంచంలో దేన్నీ, ఎవరినీ నమ్మని పట్టాభి సుందరిని నమ్మేస్తాడు. పట్టాభి ట్రావెలర్స్ బంగ్లాలో విడిది చేసున్నంతకాలం వెనుకగేటు వాడుకలోకొస్తుంది. ఆగేటులోంచి ఒకసారి లోనకు వెళ్ళిన సుందరి పట్టాభి హైదరాబాద్‌కి బయలుదేరిన్రోజే బయటకు వస్తుంది. ఆ ప్రాంతంలో మరో అందగత్తె పట్టాభి చుట్టుప్రక్కలకు రాకుండా జాగిలంలా కాపలా కాస్తుంటుంది.

పట్టాభి అలా వెళ్ళగానే ఇలా మధుమూర్తి వడిలో వాలిపోతుంది. ఈ వారంనుంచి ఒక్క పట్టాభే కావటంతో భోరు కొట్టింది. అతను సుఖం అంచున నిలబడికూడా రాజకీయాల్ని కలవరిస్తుంటాడు.

ఒకపని చేసేటప్పుడు దీక్షగా ఆ పనే చేయాలి తప్ప వేరే పని గురించి ఆలోచనయినా రాకూడదు. 'పట్టాభికి కంపార్టుమెంటలిజమ్ రాలేదింకా నీకులాగా' అని మధుమూర్తితో అంటుంది.

ఒక మగవాడ్ని నిజంగా ఇష్టపడి దగ్గరయ్యే ఆడది తను అనుభవిస్తూ, అతన్ని సుఖపెడుతుంది. ఒక మగవాడితో అవసరం వుండి దగ్గరయ్యే ఆడది అతన్ని మాత్రమే

సుఖపెడుతూ, అతని ఇగోని తృప్తి పరుస్తూ, నీ మూలంగా నేనెప్పుడూ పొందనంత సుఖాన్ని పొందుతున్నానని, ఈ వయస్సులో కూడా సెక్స్‌లో ఇంత సామర్ధ్యం కలిగివుండడం ఆశ్చర్యంగా వుందని, అమ్మో... నిన్ను భరించటం చాలా కష్టమని కబుర్లు చెప్పి తన అసంతృప్తిని అవసరానికి వెనుక దాచేస్తుంది. కరెక్టుగా అలాంటి ఆడదే ఈ సుందరమ్మ.

"ఎక్కువ మోసం చేసే అవకాశం ఆ పేపర్ ఎలా ఇస్తుంది?" ఆమె అతని వడిలోకి జారిపోతూ అంది.

"నా మీద గిట్టనివాళ్ళు దుమారం లేపారు. నేను నీతి, నిజాయితీలంటే ప్రాణం ఇస్తాను. ఏది ఏమైనా ఒకసారి నన్ను శంకించారు. ఇప్పుడిక నా నిజాయితీని రుజువు చేసుకోవాల్సిన సమయం ఆసన్నమయింది. రేపే ఎవరెవరికి ఎంత ఇవ్వాలో అంత అణాపైసల్తో సహా ఇచ్చేస్తాను. చందాదారులంతా రేపు నన్ను మా ఆఫీస్‌లో కలవవచ్చు అని అదే పేపర్‌లో రెండువేలు ఖర్చుపెట్టి ప్రకటన ఇవ్వు రేపే ఎవరెవరికి ఎంతివ్వాలో అంత ఇచ్చేయి. దాంతో ఎవరో గిట్టనివాళ్ళు చేసిన పని అని ప్రజలు నమ్మేస్తారు. అంతేకాదు నీమీద సానుభూతి, ఆ పేపర్‌పై ఆగ్రహం పుట్టుకొస్తాయి. ఎల్లుండి ఆ పేపర్‌కి నువ్వే వెళ్ళు. ఎవరి డబ్బు వారికిచ్చినట్లు చెప్పు. ఎడిటర్ చచ్చినట్లు సవరణ చేస్తాడు. ఈ లోపు లెటర్ టు దీ ఎడిటర్‌కి సుందరమ్మను మోసగత్తెగా చిత్రించటం అన్యాయం, అక్రమం అంటూ కొన్ని వుత్తరాలు రాయించు.

సరిగ్గా టైమ్ చూసుకుని బిషాణ ఎత్తేస్తే సరిపోతుంది. ఈ ప్రజలు వెర్రిగొర్రెలు...బుర్రలుండవు-సమస్య ఎదురయినప్పుడు గోక్కోటానికి పుర్రెలుంటాయి" అతని గొంతులో మత్తు, తీయని ముల్లులు.

పని సాధించుకుంది సుందరమ్మ.

0 0 0

"నీకు డబ్బిస్తాను. ఓ పని చేస్తావా?" సర్కిల్ నేరుగా విషయంలోకి వెళ్ళిపోయాడు.

ఉదయ్ ఆశ్చర్యంగా చూశాడు.

"నీ ఎనర్జీని, కాలాన్ని నేను ఉపయోగించుకుంటాను. అందుకు తగిన పారితోషికం ఇస్తాను".

ఉదయ్ ఆలోచనల్లో పడ్డాడు. జైల్లో తను పడిన కష్టానికి వచ్చిన డబ్బు కూర్చుని తింటే కొద్ది రోజుల్లోనే అయిపోతుంది. అప్పుడు? ఏదో ఒక పని చేయాలి, డబ్బు గడించాలి తప్పదు.

"చెప్పండి..." అన్నాడు ఉదయ్ పొడిగా.

"గౌసుద్దీన్ అనే ఎ.ఎస్.పి. ఇంట్లో దొంగతనం చేయాలి"

ఉదయ్ బిత్తరపోయి చూశాడు.

"నేను సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌ని..." అని వివరంగా చెప్పి ఐడెంటిటి కార్డు చూపించాడు సర్కిల్.

“నేను జైలునుంచి వచ్చాను కనుక అలాంటి పనులే చేస్తానని మీ నమ్మకం కదా? అందుకే అలా అడిగుంటారు” ఉదయ్ కళ్ళల్లో ఎరుపు జీర.

“అలా అనికాదు. ఓ మంచిపని కోసం ఈ పని చేయాలని మా ఎ.ఎస్.పి. ఆదేశం. దానికోసం ఉదయ్ అనే వ్య క్తిని అపాయింట్ చేయమని నన్ను పురమాయించాడు”

ఉదయ్‌కి సర్కిల్ ఏమన్నాడో ముందు అర్థం కాలేదు.

“ఆ ఉదయ్‌ని పట్టుకోవటం సాధ్యమయ్యేలా లేదు. అలా అని ఆ పని జరగకపోతే మా ఏ.ఎస్.పి. నన్ను క్షమించడు. అందుకే నిన్ను అడుగుతున్నాను. నువ్వే ఉదయ్ అని చెప్పేస్తాను. ఎవరయితేనేం గౌసుద్దీన్ ఇంట్లో దొంగతనం జరగటమే ప్రధానం.”

నూనూగు మీసాలతో, అప్పుడే పూర్తి యవ్వనాన్ని సంతరించుకున్న ఈ యువకుడిలో నలుగురు యమకింకరుల్ని మట్టుబెట్టే శారీరక సామర్థ్యమే కాక... ఇది ఇలా అయితే... అది అలా అయివుండవచ్చన్న రీజనింగ్ కూడా గొప్పగా వుంది. సర్కిల్ ఉదయ్‌కేసి ఆశ్చర్యంగా చూశాడు.

“మంచి కోసమే దొంగతనం అని రుజువు చేయగలిగితే ఇదే హోటల్ దగ్గర నేను దొరుకుతాను, కలవండి... వస్తాను” అని వేగంగా ముందుకు సాగిపోయాడు.

సర్కిల్‌కేం చేయాలో తోచలేదు. ఒకింతసేపు ఇంతకీ అసలు ఉదయ్ అనే అతను ఎక్కడ? ప్యాకెట్‌లో దాచుకున్న ఫోటో తీసి చూసి ఒక్కసారి షాక్ తిన్నాడు. అంటే తనింతవరకూ మాట్లాడిన వ్య క్తే ఉదయ్...

ఆత్రుతగా తలెత్తి చూశాడు. ఆ వీధి నిర్మానుష్యంగా వుంది. అతను అప్పటికే ఆ వీధి మలుపు తిరిగాడు. సర్కిల్ పరిస్థితి పిచ్చెక్కినట్లుగా వుంది.

కళ్ళముందున్న కావాల్సిన వ్య క్తిని చేతులారా వదిలేసుకున్నాడు. ఇప్పుడెలా?... అప్పుడు అతనన్న మాటలు జ్ఞప్తికి వచ్చాయి--మంచి కోసమే దొంగతనం అని రుజువు చేయగలిగితే ఇదే హోటల్ దగ్గర నేను దొరుకుతాను. అంటే ఇక్కడే కాపుకాస్తే, ఈరోజు కాకపోయినా రేపయినా దొరకవచ్చు.

కాని విషయం మరలా మొదటికొస్తుంది. ఇప్పుడిక అతనితో దొంగతనం చేయించాలంటే రెండే మార్గాలు--ఒకటి యుగంధర్ ఓ మంచిపని చేస్తున్నాడని రుజువు చేయాలి. లేదా ఉదయ్‌ని ఏదయినా అవసరంలో ఇరికించి అతనికి అల్‌రడీ వున్న ఏదయినా అవసరాన్ని తీర్చిగాని తీర్చుతాననిగాని మాటిచ్చి దొంగతనం చేయించవచ్చు.

ఏది ఎలా జరగనున్నా ఒకటిమాత్రం నిజం---ఉదయ్ శక్తి ఉక్తులున్నవాడు.

ఉదయ్ వేట మొదలయింది. వీధులన్నీ పిచ్చిపట్టినట్లుగా తిరుగుతున్నాడు. జైలునుంచి రాగానే అమ్మను, అక్కను చూడగలనన్న ఆశ వెక్కిరిస్తోంది. అతనిలో అసహనంతోపాటు పట్టుదల---తండ్రిమీద కోపం రెట్టింపవుతున్నాయి.

పబ్లిక్ ప్రాసిక్యూటర్...ఐ.పి.సి.ని ఔపోసన పట్టిన అనితరసాధ్యులయిన పబ్లిక్

ప్రాసిక్యూటర్... ఉత్కళ నాలుగయిదు రోజులుగా ఆమె మనసేం బావోలేదు. ఉదాసీనత ఆమెను పూర్తిగా ఆక్రమించుకుంది. కొన్నిఏళ్ళుగా ఎదురుచూస్తున్న వ్యక్తి కొద్దినిమిషాల తేడాతో తనకు తిరిగి దూరమైపోయాడు... తను తిరిగి కలుస్తాడా...? కలిసినా ఈ జీవితకాలంలోనేనా...? ఇప్పుడాయన వున్నాడో? అసలు పోలికే తనకు దొరక్కపోవచ్చు .... వయసుతోపాటు మనిషి ఎదిగే వుంటాడు. వీటితోపాటు మనస్సూ ఎదిగి వుండవచ్చు ఎదిగితే ఏ దృక్పథంతో ఎదిగి వుండవచ్చు?

ఈ నాలుగయిదు రోజులుగా అమ్మా--నాన్నలకు ఎదురుపడలేకపోతుంది. వారి కళ్ళల్లో కనిపిస్తున్న పుత్ర ప్రేమకు తను సిగ్గుతో తలవంచుకోవలసి వస్తోంది. తను తన తోడబుట్టిన వారికి న్యాయం చేకూర్చలేకపోయింది. ఆమె ఆ రోజు కోర్టుకు వెళ్ళలేకపోయింది.

వేవరింగ్‌గా రోడ్లన్నీ పిచ్చిపట్టినట్లుగా తిరుగుతోంది. ఉదయ్.... ఇప్పుడు నీ వెక్కడున్నావ్? ఇది నీ అక్క... నిన్ను ప్రాణాధికంగా ప్రేమించి నీ
అక్క ఉత్కళ గుండె ఘోష....

ఉత్కళ మనసంతా ఆందోళనతో నిండిపోయింది. ప్రతిక్షణం ఆ సంఘటనే ఆమెను కలవరపెడుతుంది. తమ్ముడు చేసిన పని ఆమె మెదడును ఆలోచింపచేయనీయడం లేదు. పగ ప్రతీకారం అంటే తెలియని మనస్సు పంతమూ, పట్టింపులూ అంతకంటే అర్థంకాని వయస్సు... ఎందుకు చేశావు తమ్ముడు ఆ హత్య? ఎందుకురా ఇన్నేళ్ళుగా ఒక్కసారన్నా నోరు విప్పి జరిగింది చెప్పలేదు. ఉత్కళకు ఆ రాత్రి ఎప్పటిలాగే నిద్రపట్టలేదు.

0 0 0

ఆ రోజంతా ఉదయ్ కోసం అతను చెప్పిన హోటల్ దగ్గరే ఎదురు చూస్తూ గడిపాడు సర్కిల్. సాయంత్రం ఆరు కావస్తుంది, అతను మరికొంత సేపటికయినా రావచ్చు. రాగానే తిరిగి అదే ప్రశ్న వేస్తాడు.

ఇవన్నీ అలా వుంచితే తనే ఉదయ్ అని అతను తనతో ఎందుకు చెప్పలేదు? అలా చెప్పకుండా వున్నందున అతను ఆశించిన ప్రయోజనం! ఉదయ్ అంత తేలిగ్గా తన పనిని చెరవేర్చుతాడన్న నమ్మకం కనిపించడంలేదు.

ఇక మిగిలింది ఒకే మార్గం. అతను అంతకాలం ఉండి వచ్చిన జైలుకి ఫోన్‌చేసి అతని వివరాలన్నీ సేకరింటం అంతే..... ఆ నిర్ణయానికొచ్చిన మరుక్షణం సర్కిల్ అక్కడ లేడు.

0 0 0

ఆ రాత్రంతా ఉష ఉదయ్ వింత ప్రవర్తన గురిచి ఆలోచిస్తూండిపోయింది. సుందరమ్మ

రౌడీల్ని ఎదుర్కొనే సందర్భంలో దెబ్బతిన్న హోటల్ ఫర్నిచర్‌కి మూడొందలిచ్చాడు. తను వంద వుంచుకున్నాడు.

తన అందంపట్ల తనకు గర్వం లేదుగాని విశ్వాసం వుంది. తనవేపు నలుగురూ చూడటానికి కారణం తన అందమేనని ఆమెకు ఎప్పుడో తెలుసు. అందుకు తనెప్పుడూ గర్వించలేదు. తన అందంపట్ల ఆరాధననూ పెంచుకోలేదు.

కాని అతను... అతను కనీసంగానైనా తన వేపు చూడలేదు అతను చూసిన కొద్దిక్షణాలు తనూ చూసింది.